సాక్షి చిత్తూరు

గురువారం । 2 । నవంబర్ । 2023



భరత్‌ను ఆశీర్వదించండి
కుప్పం ప్రజలకు సేవ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్‌ను ఆదరించాలని ఆయన సతీమణి దుర్గ కోరారు.
- 10లో



చిరస్మరణీయం అమరజీవి కృషి
ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన కృషి చిరస్మరణీయమని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు.
- 10లో



లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయండి
అభివృద్ధి పనుల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ ఆదేశించారు.
- 10లో

న్యూస్‌రీల్

అర్ధగిరి ఈఓగా హనుమంతరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న హనుమంతురావు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా టి.హనుమంతురావు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు గోశాల ఈఓగా పని చేస్తున్న హనుమంతురావును అర్ధగిరి క్షేత్రం ఈఓగా బదిలీ చేస్తూ ఎండోమెంట్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఈఓగా పనిచేస్తున్న వెంకటసుబ్బారెడ్డి నుంచి హనుమంతురావు పదవీబాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి ఆలయ ట్రస్టుబోర్డు, సిబ్బంది సహకారంతో తమ వంతు కృషి చేస్తానన్నారు.

మండలాలకు సీస్ ప్రశ్నపత్రాలు

చిత్తూరు కలెక్టరేట్ : స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్) పరీక్ష ప్రశ్నపత్రాలు మండల కేంద్రాలకు తరలించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పీసీఆర్ పాఠశాలలో భద్రపరిచిన ప్రశ్నపత్రాలను మండలాలకు పంపారు. ప్రశ్నపత్రాల పంపిణీకి ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ కసరత్తును డీఈఓ విజయేంద్రరావు, ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ హేమారెడ్డి పర్యవేక్షించారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓగా రాజశేఖర్‌రెడ్డి

చిత్తూరు రూరల్: ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌ఓగా రాజశేఖర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి సెలవుపై వెళ్లడంతో ఆ బాధ్యతలను రాజశేఖర్‌రెడ్డికి అప్పగించారు. 3 రోజుల పాటు ఆయన ఇన్‌చార్జిగా కొనసాగనున్నారని అందులో పేర్కొంది.

గంగవరం ఎంఈఓ సస్పెన్షన్



వేణుగోపాల్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : గంగవరం ఎంఈఓ–1 వేణుగోపాల్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ విద్యాశాఖాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ జిల్లాలో పర్యటించిన విషయం విదితమే. ఆయన గంగవరం మండలంలో పర్యటించిన సమయంలో పలు తప్పిదాలను గమనించారు. ఎంఈఓ తనిఖీలు చేయడం లేదనే విషయాన్ని గమనించిన ఆయన ఎంఈఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు ప్రస్తుతం ఎంఈఓను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ



తోటపాళెంలో కమలమ్మకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలోని సామాజిక పింఛన్‌దారులకు బుధవారం వలంటీర్లు పింఛన్ నగదును చురుకుగా పంపిణీ చేశారు. వేకువజామున 5 గంటల నుంచి వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల మొత్తాలను అందజేశారు. అనారోగ్యం కారణంగా కొందరు లబ్ధిదారులు ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నప్పటికీ వారికి కూడా నేరుగా పింఛన్ల పంపిణీ చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 2,72,492 పింఛన్‌దారులకు నగదు ఇచ్చి, సాయంత్రానికి 79.38 శాతం పంపిణీ పూర్తి చేశారు.

శ్రీవారి దర్శనానికి 5 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 62,269 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 19,255మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో భక్తులు హుండీలో రూ.5.19 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలో దర్శనం లభిస్తోంది. టికెట్లు లేనివారికి 5 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు ఉన్న వారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

3న డయల్ యువర్ ఈఓ

డయల్ యువర్ ఈఓ కార్యక్రమం నవంబర్ 3వ తేదీ ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి చానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. ఈ కార్యక్రమంలో భక్తులు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డికి సందేహాలను, సూచనలను తెలపవచ్చు.

పేదల గుండెపై సంక్షేమ సంతకం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 53 నెలల పాలన ఓ సామాజిక విప్లవం.. రాష్ట్ర రాజకీయ చరిత్రలో నవశకం. ఈ నేపథ్యంలోనే 'మేము మేలు చేశాం. అది చెప్పుకోవడానికే మీ ముందుకు వస్తున్నాం.' అంటూ నేడు చిత్తూరు జిల్లా కేంద్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు సామాజిక సాధికారత బస్సుయాత్ర చేపట్టనున్నారు. దీనిపై ప్రత్యేక కథనం.

- సీఎం జగన్‌తోనే బడుగుల అభ్యున్నతి
- నాలుగున్నరేళ్లలో సంక్షేమానికి రూ.వేల కోట్లు
- నేడు చిత్తూరులో సామాజిక సాధికారత బస్సుయాత్ర



నగరంలో ఏర్పాటు చేసిన సాధికారత యాత్ర ఫ్లెక్సీలు



సాక్షి, చిత్తూరు/ చిత్తూరు కార్పొరేషన్: రాజకీయపార్టీల్లో బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలు పల్లకీ మోసే బోయీలుగా మిగిలిపోయే వారు. ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాల్లో అరకొర భాగస్వామ్యం ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆ చరిత్రను తిరగరాసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు సమున్నత గౌరవమిచ్చింది. పేదలకు ఆర్థిక చేయూత నిచ్చేందుకు తొలిరోజు నుంచి అడుగులు పడుతున్నాయి. సిఫార్సులతో నిమిత్తం లేకుండా అర్హతే ప్రామాణికంగా పేదల ఇంటి ముంగిటకే సంక్షేమం వచ్చి వాలుతోంది. సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని వర్గాల ఉన్నతికి తోడ్పాటు అందించిన ఏకైక సర్కారు వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

- గతంలో సామాజిక న్యాయం, రాజ్యాధికారం మాటలు చెప్పుకునేందుకు మాత్రమే. వర్తమానంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఆచరణలో చూపెట్టింది. ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో చేసిన మేలు, పథకాల అమలుతో చేకూరిన లబ్ధిని చెప్పుకునేందుకు సమాజంలో అణగారిన వర్గాలకు లభించిన గౌరవ మర్యాదలను వివరించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రీకారం చుట్టింది. గురువారం చిత్తూరులో సామాజిక సాధికార యాత్ర చేపట్టనున్నారు.

ఆత్మగౌరవం కోసం..

రాబోవు ఎన్నికల్లో పెత్తందారులకు, పేదలకు మధ్య జరగనున్న పోటీని వివరించేందుకు వైఎస్సార్ సీపీ నేతలు సన్నద్ధమయ్యారు. ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితం చేసిన టీడీపీ ఓ వైపు, పేదల సామాజిక స్థాయి పెంపు, ఆర్థిక ఉన్నతికి బాటలు వేసిన వైఎస్సార్ సీపీ మరోవైపు ఉన్న నేపథ్యంలో ఆత్మగౌరవం నిలుపుకునేందుకు సామాజిక సాధికార యాత్ర చేపట్టనున్నారు.

నాడు న్యాయం జరగని దుస్థితి

అధికారంలోకి రాగానే అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తామని చెప్పిన టీడీపీ పాలకులు గతంలో ప్రజలను మోసగించారు. టీడీపీ పాలకులు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారే తప్ప, అవి నెరవేర్చిన దాఖలాలు లేవు. అప్పట్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వర్గాలకు ఏ మాత్రం న్యాయం జరగని దుస్థితి. 85 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజిక వర్గాలున్నప్పటికీ వారికి గతంలో రాజ్యాధికారం, సంక్షేమ పథకాలు దక్కేవి కావు. అన్ని కులాలను ఓటు బ్యాంకు కోసమే టీడీపీ వాడు కుందే తప్ప వారికి ఏ మాత్రం చేయూత నివ్వలేదు.

దేశంలో ఎక్కడా లేని విధంగా మేలు : మంత్రి

దేశంలో ఎక్కడా లేని విధంగా బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మేలు చేసిందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయా సామాజిక వర్గాలకు పదవులిచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా ప్రాధాన్యతనిచ్చారన్నారు. నాలుగున్నరేళ్లుగా చేసిన మేలును బస్సుయాత్రలో ప్రజలకు తెలియజేయనున్నట్లు చెప్పారు. యాత్రను జయప్రదం చేయడానికి పార్టీ క్యాడర్ కృషి చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన ప్రయోజనాలను ఈ యాత్ర ద్వారా ఆయా వర్గాలకు చెందిన మంత్రులు, నేతలు ప్రజలకు వివరిస్తారన్నారు.

నేడు బస్సుయాత్ర.. భారీ బహిరంగ సభ

చిత్తూరు జిల్లా కేంద్రంలో గురువారం సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహించనున్నారు. మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదరిస్తూ మద్దతు తెలిపేందుకు చిత్తూరు ప్రజలు సిద్ధమయ్యారు. యాత్రను విజయవంతం చేసేందుకు భారీగా జనం విచ్చేయనున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి

సామాజిక సాధికారత యాత్ర ఏర్పాట్లను బుధవారం అటవీ, విద్యుత్ శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు భరత్, మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్‌లతో కలిసి పరిశీలించారు. స్థానిక కట్టమంచిలోని కల్యాణ మండపంలో నిర్వహించనున్న విద్యావేత్తల సమావేశ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అక్కడ నుంచి నాగయ్య కళాక్షేత్రం వద్ద బహిరంగ సభ ఏర్పాట్లను చూసి ఎస్పీ రిశాంత్‌రెడ్డికి తగు సూచనలు చేశారు. చివరిగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అధికార, అనధికారులతో సమావేశమయ్యారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి

బడుగులకు అగ్రతాంబూలం

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక 90 శాతం పదవులు, పథకాలు బడుగు, బలహీన వర్గాలకే కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్ర కులాల పేదలకు పదవులు, సంక్షేమ పథకాల్లో పెద్దపీట వేసింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. 85 శాతానికి పైగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజిక వర్గాలకు ప్రభుత్వ పథకాలు, పార్టీ పదవుల్లోనూ సీఎం వైఎస్ జగనన్న అగ్రతాంబూలం ఇచ్చారు.

చట్టసభల్లో బీసీలకు ప్రాధాన్యత



రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా చట్టసభల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పించిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. కుప్పంలోని బీసీ మహిళ వనితకు వన్నికుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ , నాగభూషణమ్మకు వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాష్ట్ర స్థాయి పదవులు ఇచ్చారు. ప్రతి పథకంలోనూ బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. బీసీలు అధికంగా ఉన్న కుప్పంలో నామినేటెడ్, పార్టీ పదవులు, చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించారు. – అరుణ్, డీకే పల్లె, కుప్పం

పేదలకు వరం



జగనన్న పాలన నా లాంటి పేదలకు వరంగా మారింది. మా పిల్లలకు అమ్మఒడి పథకంలో నాలుగేళ్లలో రూ.56 వేలు లబ్ధి చేకూరింది. వైఎస్సార్ ఆసరాలో రూ. 54 వేలు అందింది. నేనున్న నివాసానికి ఓటీఎస్ పథకంలో శాశ్వత హక్కు కల్పించారు. 40 సెంట్లు డీకేటీ భూమి ఉంటే సీఎం ఆదేశాలతో దానికి శాశ్వత భూహక్కు కింద పట్టా ఇచ్చే ప్రక్రియ దాదాపు పూర్తయింది.
-ఎం.రామమూర్తి, ముడిపల్లి దళితవాడ, నగరి మండలం

జగనన్నకు వెన్నుదన్నుగా నిలుస్తాం



గత ప్రభుత్వంలో ఎలాంటి మేలు జరగలేదు. జగనన్న ప్రభుత్వంలో పథకాలతో లబ్ధి పొందాను. ఆసరా పథకంలో రూ. 18,750 చొప్పున రెండేళ్ల వచ్చింది. మరిన్ని పథకాలు అందాయి. మాలాంటి పేదలను ఆదుకునే జగనన్నకే వెన్నుదన్నుగా నిలుస్తాం.
– షేక్ చానూమాబీ, దాదేపల్లె, చౌడేపల్లి మండలం

అమరజీవికి నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ఆంధ్రరాష్ట్ర ఆవతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళులర్పించారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. పొట్టి శ్రీరాములు రాష్ట్రం కోసం చేసిన త్యాగాన్ని మంత్రి కొనియాడారు.

పకడ్బందీగా ఓటర్ల నమోదు ప్రక్రియ

చిత్తూరు కలెక్టరేట్ : ఓటర్ల నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశమందిరంలో ప్రత్యేక ఓటర్ల సవరణ 2024 కసరత్తుపై ఈఆర్వో, ఏఈఆర్వో, ప్రత్యేకాధికారులు, మండల స్థాయి బృందాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు స్వీప్ (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్టోరల్) యాక్టివిటీని ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ 2024 ప్రక్రియలో 2023 అక్టోబర్ 27న ముసాయిదా ఫొటో ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. ఆ జాబితాలో జెండర్, ఈపీ రేషియోలపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటర్ల జాబితాలో మృతుల వివరాలు తొలగించకపోవడం, పెళ్లి చేసుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లు తొలగించకపోవడం, వేరే ప్రాంతాలకు బదిలీ అయిన ఉద్యోగుల ఓట్ల ను తొలగించకపోవడం వంటివి ఈపీ (ఎలక్టోరల్ పాపులేషన్) రేషియో జిల్లాలో పెరగడానికి కారణాలు ఉండవచ్చన్నారు. ఆ రేషియో తగ్గింపునకు అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కళాశాలల్లో అవగాహన కల్పించండి

జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలన్నారు. నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని చెప్పారు. ఎక్కడైనా నిర్వహించలేదని ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముసాయిదా జాబితాలో ఏవైనా తప్పిదాలుంటే బీఎల్వోల దృష్టికి తీసుకురావాలన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితాకు చర్యలు చేపట్టాలన్నారు. క్లెయిమ్‌లు, ఆక్షేపణలు పూర్తి చేసేందుకు డిసెంబర్ 26, డేటాబేస్‌లో వివరాలను అప్‌లోడ్ చేసేందుకు 2024 జనవరి ఒకటో తేది తుదిగడువు అని తెలిపారు. జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు చెప్పారు. త్వరలో జరగబోయే ఎన్నికలు పూరయ్యే వరకు ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఎన్నికల నియమ, నిబంధనలను ప్రతి ఒక్కరూ తెలుసుకుని అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓలు చిన్నయ్య, సుజన, మనోజ్‌కుమార్‌రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు కిరణ్మయి, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వినాయకా.. విఘ్నాలు తొలగించు



చతుర్థి వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

- శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతం
- రాత్రి స్వర్ణరథంపై గణనాథుని విహారం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పౌర్ణమి తరువాత నాలుగో రోజు వచ్చే చతుర్థి రోజున ఈ వ్రతం ఆచరించడం ఆనవాయితీ. వేకువజామున ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అలంకార మండపంలో శ్రీసిద్ధి,బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవరులకు విశేష అభిషేకాలు నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆస్థాన మండపంలో కొలువు తీర్చారు. తదుపరి 10 గంటలకు ఒకసారి, సాయంత్రం 5గంటలకు మరోసారి అర్చక వేదపండితులు శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున వ్రత పూజల్లో పాల్గొన్నారు. వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు మాట్లాడుతూ ప్రతి నెలా భక్తుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం వ్రత పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



స్వర్ణ రథంలో వినాయకస్వామివారు

స్వర్ణ రథంపై వరసిద్ధుడు

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారు బుధవారం రాత్రి స్వర్ణరథంపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. సంకటహర చతుర్థి గణపతి వ్రతం సందర్భంగా రాత్రి ఆలయంలోని ఆస్థాన మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామివారిని కొలువుదీర్చి, ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను స్వర్ణరథంలో కొలువుదీర్చి పూజలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం స్వర్ణరథంపై స్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించారు. రథోత్సవంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి ఎంపీడీఓలకు శిక్షణ

చిత్తూరు కార్పొరేషన్: ఉద్యోగోన్నతి పొందిన 32 మంది ఎంపీడీఓలకు ఈ నెల 21వ తేదీ నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ డైరెక్టర్ మురళి రాష్ట్రంలోని జెడ్పీ సీఈఓ, ఈటీసీ ప్రిన్సిపాళ్లతో బుధవారం గూగుల్ మీట్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో మొదటి విడతలో 22 మంది, రెండో విడతలో 10 మంది ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందారని సీఈఓ తెలిపారు. వీరికి పాలన, అభివృద్ధి, ఇతర అంశాలపై నెల రోజుల పాటు శ్రీకాళహస్తిలోని ఈటీసీలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీపీఆర్సీ డీసీ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో 'జాగృతి జీ20 స్టార్టప్ 20' బృందం

వరదయ్యపాళెం: దేశంలోని వివిధ రాష్ట్రాలు, జీ20 దేశాలకు చెందిన 520 మంది జాగృతి జీ20 స్టార్టప్ 20 యాత్ర బృందం బుధవారం శ్రీసిటీని సందర్శించింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారు చేసే లక్ష్యంతో జాగృతి సేవా సంస్థాన్ అనే స్వచ్ఛంద సంస్థ ఏటా ఇలాంటి యాత్ర చేపడుతుంది. ప్రత్యేక రైలులో దేశమంతటా పర్యటించి వివిధ రంగాలలో ప్రముఖులను కలుస్తూ ఉంటుంది. అందులో భాగంగా శ్రీసిటీ సందర్శనకు వచ్చిన బృందానికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ జాగృతి యాత్ర బృందం శ్రీసిటీకి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. భారీ ఉద్యోగాల కల్పనతో అత్యంత అనుకూల వ్యాపార నగరాల్లో ఒకటిగా రూపుదిద్దుకున్న శ్రీసిటీ జాగృతి యాత్ర దర్శనీయ స్థలాల్లో చేరడం గౌరవప్రదంగా భావిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా విదేశీ పెట్టుబడులను ఆకర్షించే అవకాశమున్న 10 గొప్ప ప్రదేశాల్లో శ్రీసిటీ ఒకటిగా ఎదిగిందని వెల్లడించారు. ప్రస్తుతం 28 దేశాల నుంచి 210కి పైగా కంపెనీలు శ్రీసిటీలో పెట్టుబడులు పెట్టినట్లు వివరించారు. జాగృతి ప్రతినిధులు మాట్లాడుతూ రోల్ మోడల్‌గా ఎంచుకున్న రవీంద్ర సన్నారెడ్డిని కలిసి పలు విషయాలను తెలుసుకున్నామన్నారు. అనంతరం శ్రీసిటీలోని ఈప్యాక్, అంబర్, థర్మ్‌మ్యాక్స్, వీఆర్‌వీ, ఆక్సిలెంట్ ఫార్మా, జెడ్‌టీటీ, ఏఎల్‌ఎఫ్, ఎంఎండీ, బెర్జిన్ పైప్స్ పరిశ్రమలను సందర్శించారు. శ్రీసిటీ పర్యటనకు అవకాశం కల్పించిన యాజమాన్యానికి జాగృతి సంస్థ సీఈఓ అశుతోష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.





జాగృతి ప్రతినిధులనుద్దేశించి మాట్లాడుతున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

సైబర్ క్రైమ్‌పై ప్రతినెలా అవగాహన


చౌడేపల్లెలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రవికుమార్

చిత్తూరు అర్బన్: చాపకింద నీరుగా విస్తరిస్తున్న సైబర్ క్రైమ్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడానికి ప్రతినెలా మొదటి బుధవారం జిల్లా వ్యాప్తంగా సైబర్ జాగృత్ దివస్ పేరిట అవగాహన కల్పించనున్నట్లు చిత్తూరు ఎస్పీ రిశాంత్‌రెడ్డి తెలిపారు. చిత్తూరులో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇతర నేరాలతో పోలిస్తే ఏటా 12 శాతం సైబర్ క్రైమ్ నేరాలు పెరుగుతుండటం ఆందోళన కలిగించే విషయమన్నారు. ప్రజలు అత్యాశకు పోయి సైబర్ ఉచ్చులో పడుతుండడమే నేరాలు పెరగడానికి ప్రధాన కారణమన్నారు. కాగా బుధవారం జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో కళాశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్మార్ట్ ఫోన్లకు వచ్చే మెసేజ్‌లు, లింకులు, ఫోన్ ద్వారా జరిగే మోసాలపై వివరించారు.

సొంతింటి కల సాకారం చేసుకోండి

- 35 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకుని మీ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని లబ్ధిదారులకు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, కలెక్టర్ సగిలి షణ్మోహన్ సూచించారు. మండలంలోని ఎగువపాలకూరులో బుధవారం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, కలెక్టర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామంలో 35 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుస్తుందని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని కొనియాడారు. గ్రామీణ ప్రజలు అభివృద్ధి చేసే ముఖ్యమంత్రిని ఆదరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు రుణపడి ఉంటాం

ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులకు రుణపడి ఉంటామని పట్టాలు తీసుకున్న లబ్ధిదారులు తెలిపారు.


లబ్ధిదారుకు ఇంటి పట్టా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

గ్రామంలో అర్హులు 35 మంది ఉన్నామని తమకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేవని విన్నవించామన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఎంఎస్ బాబు గ్రామంలోని ముగ్గురు రైతుల వద్ద ఇళ్ల కోసం ఎకరా భూమిని తీసుకుని, 35 మందికి పట్టాలు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ పరిశీలకుడు తలపులపల్లె బాబురెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త పూతలపట్టు ఇన్‌చార్జి జగదీశ్వర రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, వైఎస్సార్ సీపీ నాయకులు రాజారత్నంరెడ్డి, కోదండరెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

భరత్‌ను ఆశీర్వదించండి

శాంతిపురం: కుప్పం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, సేవ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్‌ను ఆదరించాలని ఆయన సతీమణి దుర్గ కోరారు. 'జగనన్నతో జనం- భరతన్నతో మనం' కార్యక్రమంలో భాగంగా బుధవారం మతం పంచాయతీలో ఆమె పర్యటించారు. కేపీ మిట్ట, సంతూరు, గొల్లపల్లె, వేంకటేష్‌పురం, చిట్టేపల్లె, పాన్నేపల్లె గ్రామాల్లో ఆమె ఇంటింటికీ వెళ్లి దీపావళి సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా కుప్పంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా భరత్ చేస్తున్న కృషిని వివరించారు. కరోనా కష్టకాలంలో కూడా భరత్ ప్రజల్లోనే ఉంటూ అందరికీ నిత్యావసరాలు, జబ్బు పడిన వారికి వైద్యం అందేలా చూశారని గుర్తు చేశారు. కార్యక్రమం సాగుతున్న తీరును ఎమ్మెల్సీ భరత్ కేపీ మిట్టలో పరిశీలించారు. రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనిత, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పెద్దన్న, నాగమ్మ, కృష్ణమూర్తి, సర్పంచ్ మురళి, ఎంపీటీసీ సభ్యుడు చంద్రప్ప, సైపుల్లా తదితరులు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ సతీమణి దుర్గ

లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయండి

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనుల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం విజయవాడ నుంచి జెడ్పీ, పంచాయతీ, డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేందుకు కార్యాలయ భవనాలను నిర్మిస్తుందన్నారు. ఆ భవనాల పనులను నాణ్యతతో నిర్మించాలని ఆదేశించారు. స్వామిత్ర సర్వే వేగవంతం చేయాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని తెలిపారు. అనంతరం జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి జిల్లా ప్రగతిని ముఖ్య కార్యదర్శికి వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీపీఓ లక్ష్మి, డ్వామా పీడీ గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఇతర అధికారులు

పోలీసు, అగ్నిమాపక అధికారులకు సేవా పతకాలు


నాగేశ్వరరావు, మురళీధర్

చిత్తూరు అర్బన్: ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు అధికారులకు సేవా పతకాలు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు ఏఆర్ ఏఎస్పీ గుల్లిపల్లె నాగేశ్వరరావు, తిరుపతి టాస్క్‌ఫోర్స్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.సుబ్రమణ్యంరాజు ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు. కఠిన సేవా పతకం కింద కదిరి సురేష్‌బాబు (ఆర్ఎస్ఐ-టాస్క్‌ఫోర్స్, తిరుపతి), సేవా పతకం కింద బొబ్బిడి మురళీధర్ (ఏఆర్-డీఎస్పీ, చిత్తూరు), ఏ.నిరంజన్‌కుమార్ (పీటీసీ-తిరుపతి), ఎం.సత్యనారాయణ (ఏఎస్ఐ-పుంగనూరు), కె.సురేష్‌బాబు (హెచ్‌సీ-చిత్తూరు స్పెషల్‌బ్రాంచ్), ఎం.మధుకుమార్ (పీసీ-చిత్తూరు ట్రాఫిక్), వి.మణి (ఏఎస్ఐ-శ్రీకాళహస్తి), కె.శారద (ఏఎస్ఐ-వరదయ్యపాలెం), ఆర్.రవికుమార్ (ఏఆర్‌హెచ్‌సీ-తిరుపతి), బి.మధుసూదన్ (పీసీ-అలిపిరి), సి.మస్తానయ్య (పీసీ-నాయుడుపేట), ఇ.సంతోష్‌కుమార్ (ఏఆర్‌పీసీ-తిరుపతి), ప్రసాద్‌రాజు (పీసీ-టాస్క్‌ఫోర్స్, తిరుపతి), కె.విజయప్ప (హెచ్‌సీ-ఎస్పీఎఫ్,తిరుపతి), కె.వెంకటరమణ (సీటీ-టీటీడీ)లు ఎంపికయ్యారు. ఇక పాకాల అగ్నిమాపకశాఖలో పనిచేస్తున్న కె.విశ్వనాథం, గూడూరు అగ్నిమాపకశాఖలో పనిచేస్తున్న డి.విజయ్‌కుమార్ సేవాపతకాలకు ఎంపికయ్యారు.

చిరస్మరణీయం అమరజీవి కృషి

- కలెక్టరేట్‌లో ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం
- పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించిన కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్

చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన కృషి చిరస్మరణీయమని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రిజర్వ్ సాయుధ దళం నుంచి గౌరవవందనం స్వీకరించిన అనంతరం కలెక్టర్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం స్పందన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు సేవలు, ప్రాణత్యాగం మరువలేనిదని చెప్పారు. భాషా ప్రయుక్త ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన 56 రోజుల పాటు ఆమరణ దీక్ష చేశారన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు మరణానంతరం ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రరాష్ట్రం అవతరించిందన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ మద్రాసు ప్రెసిడెన్సీలో ఉన్న సమయంలో ఆంధ్ర ప్రాంత ప్రజలు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోసం ఉద్యమించారని చెప్పారు. 1953 నవంబర్ 1న తెలుగు మాట్లాడే 11 జిల్లాలతో ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. ప్రజలు మాట్లాడే భాష ఆధారంగా ఏర్పడిన తొలి రాష్ట్రంగా ఆంధ్రరాష్ట్రం చరిత్రకెక్కిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఏఎస్పీ సుధాకర్, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ షణ్మోహన్


పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

పోలీసుశాఖలో..

చిత్తూరు అర్బన్: ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని చిత్తూరు పోలీసుశాఖలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి బుధవారం చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన కృషి ప్రతి తెలుగువానికి స్ఫూర్తిదాయకమన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం శ్రీరాములు చేసిన శాంతియుత పోరాటం, అంకితభావం నేటి యువతకు ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు, ఆర్ఐలు నీలకంటేశ్వరరెడ్డి, మధు, ఏఓలు మోహన్‌రావు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జూడో పోటీలకు వడమాలపేట విద్యార్థిని

పుత్తూరు రూరల్: రాష్ట్ర స్థాయి జూడో పోటీలలో సత్తా చాటిన వడమాలపేట విద్యార్థిని యశ్వంతి జాతీయ జట్టుకు ఎంపికైనట్లు పీడీ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూడో పోటీలలో తమ స్కూలు విద్యార్థులు ఒక బంగారు, 4 రజిత పతకాలు సాధించారని ఆయన చెప్పారు. అండర్-14 బాలికల 44 కేజీల విభాగంలో యశ్వంతి బంగారు పతకం, 40 కిలోల విభాగంలో భవిత, 50+లో శ్రావణ్‌కుమార్ రజిత పతకం, అండర్-17 బాలికల 44 కిలోల విభాగంలో సాహితి, 90 కిలోల విభాగంలో ధనుష్‌కుమార్ రజిత పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు వరకు జమ్మూ కశ్మీర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు యశ్వంతి ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. యశ్వంతి జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటి పతకం సాధించాలని హెచ్ఎం కరుణానవనీతం ఆకాంక్షించారు. క్రీడాకారులను ఉపాధ్యాయ బృందం అభినందించింది.


పతకాలు సాధించిన క్రీడాకారులతో ఉపాధ్యాయ బృందం, (వృత్తంలో) యశ్వతి

రాష్ట్రస్థాయి పోటీలకు రాగిమానుపెంట విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని ఎగువరాగిమానుపెంట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయని సుజాత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 30వ తేదీన తిరుపతిలోని మంగళం జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు వెల్లడించారు. అండర్-14 బాలికల విభాగంలో 8వ తరగతి విద్యార్థినులు సోనియా, దీక్ష, బాలుర విభాగంలో నవీన్‌కుమార్, అండర్-17 బాలికల విభాగంలో పదో తరగతి విద్యార్థిని సోనియా, తొమ్మిదో తరగతి విద్యార్థిని చరిష్మా, బాలుర విభాగంలో పదో తరగతి విద్యార్థి నేతాజీ సత్తా చాటి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు వెల్లడించారు. విద్యార్థులు, పీఈటీ దశరథను ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా ప్రదోష నంది కుంభాభిషేకం


నంది వాహనంపై ఊరేగుతున్న సదాశివేశ్వరస్వామి

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలో ప్రసిద్ధ కామాక్షీ సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రదోష నంది ఉత్సవర్లకు బుధవారం కుంభాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. ఈప్రదోష నంది ఉత్సవర్లను పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ఆలయానికి కానుకగా అందించారు. కుంభాభిషేకం కార్యక్రమం మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో జరిగింది. ఉదయం 7 గంటలకు కలశపూజ, గోదర్శనం, దశ దర్శన హోమాలు నిర్వహించారు. 10 గంటలకు ప్రదోషమూర్తికి అర్చకులు మురళీధర్ గురుకుల్ బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కుంభాభిషేకం నిర్వహించారు. 11 గంటలకు తొలిసారిగా స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు నంది వాహన సేవను నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌ప్రసాద్‌రెడ్డికి ఆలయ మర్యాదలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలిప్‌మొదలి, కమిటీ సభ్యులు, రమేష్, సుందరం, బాబు, విజయలక్ష్మీ, రుక్మిణి, భరణి, కౌన్సిలర్లు నరసింహ, ఏకాంబరం, భానుమతి, వైఎస్సార్‌సీపీ నాయకులు మనోహర్‌రెడ్డి, జయచంద్ర, లక్ష్మణమూర్తి, ప్రకాష్, గోపి, శివ, పాండు, చక్రి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు అరగొండ విద్యార్థిని


లాస్య

తవణంపల్లె: రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు తవణంపల్లె మండలం అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఎస్.లాస్య ఎంపికైనట్లు ఆ స్కూలు హెచ్ఎం మోహన్‌రెడ్డి, పీడీ అరుణ తెలిపారు. సెప్టెంబర్ 29వ తేదీన గంగాధరనెల్లూరులో జరిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-17 బాలికల జట్టు హాకీ పోటీల్లో లాస్య పాల్గొని, సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు అనకాపల్లెలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి ఆమె బయలుదేరినట్లు తెలిపారు. లాస్య రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి, తవణంపల్లె పేరు నిలపాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆకాక్షించారు.

టపాసుల విక్రయాలకు అనుమతి తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య

చిత్తూరు కలెక్టరేట్ : టపాసుల విక్రయాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆర్డీఓ చిన్నయ్య అన్నారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో సమన్వయకమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ రోజున టపాసులు విక్రయించే దుకాణాలకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను అనుసరిస్తూ అనుమతులకు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. బహిరంగ ప్రదేశంలో దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్, అగ్నిమాపక, రెవెన్యూ అధికారులు సమన్వయంగా టపాసుల విక్రయానికి ఓ ప్రదేశం నిర్ణయించాలని తెలిపారు. తాత్కాలిక దుకాణాల్లో ఏడు రోజుల పాటు నిర్వహించుకోవచ్చన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా నిబంధనలు పాటించాలని చెప్పారు. ప్రతి దుకాణం మధ్య పది అడుగుల దూరం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఓ రామాంజులునాయక్, జిల్లా అదనపు అగ్నిమాపక శాఖ అధికారి కరుణాకర్, సీఐ విశ్వనాథరెడ్డి, సిబ్బంది రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీవానదిలో పడి వ్యక్తి మృతి


గణేష్ మృతదేహం

యాదమరి: ప్రమాదవశాత్తు నీవానదిలో పడి కూలీ మృతి చెందిన సంఘటన యాదమరి మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుమన్ కథనం మేరకు.. పెరియంబాడికి చెందిన గణేష్(50) కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం యాదమరిలో నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసి, వాటిని తీసుకుని ఇంటికి వెళుతుండగా కళ్లు తిరగడంతో నీవానది బ్రిడ్జిపై కుర్చున్నాడు. అంతలోనే అదుపుతప్పి ప్రమాదవశాత్తు నదిలోని నీళ్లలోకి పడిపోయాడు. చుట్టు పక్కల వారు వెంటనే నీటిలోకి దిగి గట్టు పైకి తీసుకొచ్చారు. 108 వాహన సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరిశీలించి, అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పుత్తూరు రూరల్: పట్టణంలోని మహాలక్ష్మీపురం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు.. పుత్తూరు మున్సిపాలిటీ ఒకటో వార్డు పల్లూరు గ్రామానికి చెందిన మునెమ్మ(55) మహాలక్ష్మీపురం వద్ద రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి విజయపురం వెళుతున్న 108 వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో మునెమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త వడివేలురెడ్డి, వివాహితులైన ముగ్గురు కుమార్తెలున్నారు. మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారా కేసులో ఒకరి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ పోలీసులు

చిత్తూరు అర్బన్: సారా కలిగి ఉన్న కేశవన్ అనే నిందితుడిని స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) చిత్తూరు రూరల్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యాదమరిలో ఎస్ఈబీ పోలీసులు తనిఖీలు చేపట్టారు. రంగనాయచెరువు అటవీ ప్రాంతంలో సారా తయారీకి నిల్వ ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఇదే మండలంలోని తంజావూరు క్రాస్ వద్ద ఓ క్యాన్‌లో ఐదు లీటర్ల సారా తీసుకెళుతున్న కేశవన్ అనే నిందితుడ్ని అరెస్టు చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం గౌడ్, మమత, గాయత్రి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.